## క్లుప్తంగా

### పైపులరోడ్డులో శ్రీరాముడి శోభాయాత్ర



**పాయకాపురం(విజయవాడరూరల్):** అయోధ్యలో శ్రీబాల రాముడి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని పురస్కరించుకుని పైపులరోడ్డు సెంటర్‌లో ఆదివారం శ్రీరామ శోభాయాత్రను నిర్వహించారు. సీతా సమేత శ్రీరామ లక్ష్మణ హనుమంతుడి విగ్రహాలను ఎమ్మెల్యే మల్లాది విష్ణు చేతపట్టుకుని శోభాయాత్రలో పాల్గొన్నారు. అయోధ్యలో శ్రీబాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ ఘట్టం చారిత్రాత్మకమని, ఈ ఘట్టాన్ని విజయవంతం చేస్తూ రామ భక్తులు వాడవాడలా చేస్తున్న కార్యక్రమాలు అమోఘమని ఎమ్మెల్యే విష్ణు అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

### గానాల రామ్మూర్తి సేవలు అమ్యూలం

**అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):** విశ్వ బ్రాహ్మణులను బీసీల్లో చేర్చేందుకు, వారి అభ్యున్నతికి రావు సాహెబ్ పండిత గానాల రామ్మూర్తి చేసిన సేవలు ఎంతో అమూల్యమైనవని విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ అన్నారు. విశ్వబ్రాహ్మణ యువజన సంఘం నగర అధ్యక్షుడు చిట్టూరి హరీష్ ఆధ్వర్యంలో మాజీ శాసనమండలి సభ్యుడు గానాల రామ్మూర్తి జయంతి కార్యక్రమం సింగ్‌నగర్ పైపులరోడ్డు సెంటర్ వద్ద ఆదివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన నిర్వాహకులతో కలిసి రామ్మూర్తి చిత్ర పటానికి పులమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీకాంత్ మాట్లాడుతూ ఆనాటి మద్రాస్, ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో శాసనమండలి సభ్యుడిగా ఉన్న రావు సాహెబ్ పండిత గానాల రామ్మూర్తి అప్పటి బ్రిటీష్ ప్రభుత్వాన్ని ఒప్పించి విశ్వ బ్రాహ్మణులందరినీ బీసీల్లో చేర్పిన మహనీయుడు అని పేర్కొన్నారు. అనంతరం స్థానికులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సేవా సంఘం మహిళా కార్యదర్శి ముందురి సత్యవతి, సంఘం నాయకులు కొండూరు మోహనరావు, శ్యామ్, రమేష్, మణికంఠ, సమత తదితరులు పాల్గొన్నారు.

### దేవీనగర్‌లో బాలరాముడి ప్రతిష్ట ప్రత్యక్ష ప్రసారం

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** అయోధ్యలో బాలరాముడి ప్రతిష్ట కార్యక్రమాన్ని ప్రజలందరూ ప్రత్యక్షంగా చూసేందుకు దేవీనగర్ శ్రీ కోదండ రామాలయం వద్ద ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసినట్లు ఆలయ కార్యదర్శి గంగిశెట్టి సాంబశివరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు ప్రత్యక్ష ప్రసారం జరుగుతుందన్నారు. అలాగే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

### క్రికెట్ నెట్ కోర్టు ప్రారంభం



**విజయవాడస్పోర్ట్స్:** శాతవాహన డిగ్రీ కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రికెట్ నెట్ కోర్టును ఆ కళాశాల కరస్పాండెంట్, జాయింట్ సెక్రటరీ ఎస్.రమాసత్యనారాయణ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడారంగంలో యువతకు ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. యువత ప్రతి రోజూ కొంత సమయం క్రీడలకు కేటాయించాలని సూచించారు. క్రికెట్ నెట్ కోర్టు నిర్వాహకుడు కె.విశ్వనాథ్ మాట్లాడుతూ పిల్లల్లో క్రికెట్ పట్ల అవగాహన కల్పించేందుకు ఈ నెట్స్ ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రోజూ ఉదయం 6 నుంచి రాత్రి రెండు గంటల వరకు నెట్ కోర్టు అందుబాటులో ఉంటుందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

### బ్లేడ్ బ్యాచ్ వీరంగం అవాస్తవం

**సీఐ దుర్గారావు**

**విజయవాడస్పోర్ట్స్:** కృష్ణలంక కరకట్ట సమీపంలో బ్లేడ్ బ్యాచ్ వీరంగమంటూ ఆదివారం రాత్రి సోషల్ మీడియాలో జరిగిన ప్రచారాన్ని కృష్ణలంక సీఐ దుర్గారావు ఖండించారు. రణధీర్‌నగర్‌కు చెందిన ఒడుగు ఏసురాజు కరకట్ట సమీపంలోని ఓ బార్‌లో మద్యం తాగి పడిపోయాడని, ఆ విషయం గమనించిన అతని తండ్రి ఒడుగు ఏడుకొండలు ఇంటికి తీసుకెళ్లే క్రమంలో ఇద్దరికీ వాగ్వాదం జరిగిందన్నారు. స్థానికుల సమాచారంలో వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న తమ సిబ్బంది ఇద్దరినీ ఇంటికి పంపించారని తెలిపారు. అయితే బ్లేడ్ బ్యాచ్ వీరంగమంటూ వాట్సప్, ఫేస్‌బుక్, తదితర మాధ్యమాల్లో పలువురు ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. తండ్రీకొడుకుల మధ్య వివాదాన్ని బ్లేడ్ బ్యాచ్ వివాదంగా చిత్రీకరించడం తగదన్నారు. మతిస్థిమితం లేని ఏసురాజు మద్యం తాగినప్పుడల్లా ఈ విధంగా రాద్ధాంతం చేస్తుంటాడని తన విచారణలో తేలిందన్నారు.







# స్మృతి వనం..జన వనం

విజయవాడ స్వరాజ్ మైదానంలోని స్మృతి వనం జనవనంగా మారుతోంది. స్వరాజ్ మైదానంలో రాష్ట్రానికే ఐకాన్‌గా నిలిచిన సామాజిక న్యాయ మహాశిల్పం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల మహా విగ్రహాన్ని ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. అత్యంత సుందరంగా తీర్చిదిద్దిన స్మృతి వనాన్ని ప్రారంభించారు. ఆ మరుసటి రోజు నుంచి సందర్శకులకు అనుమతిచ్చారు. వీటిని తిలకించేందుకు సందర్శకుల తాకిడి రోజు రోజుకూ పెరుగుతోంది. ఆదివారం సెలవు దినం కావడంతో సందర్శకులు పోటెత్తారు. పిల్లలు, పెద్దలు కుటుంబ సమేతంగా స్మృతి వనాన్ని సందర్శించి ఆనందానుభూతి పొందుతున్నారు. –సాక్షి ఫొటో గ్రాఫర్, విజయవాడ









# సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష

- సెంట్రల్‌లో భారీ మెజార్టీతో వైఎస్సార్ సీపీ గెలుపు
- ఎమ్మెల్యే మల్లాది విష్ణు–నేను కలిసే పని చేస్తున్నాం: వెలంపల్లి శ్రీనివాసరావు



కండ్రికలో శ్రీకనక దుర్గమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు

**పాయకాపురం(విజయవాడ రూరల్):** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే తనకు శ్రీరామరక్ష అని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా ఆదివారం 64వ డివిజన్ కండ్రికలో ప్రతీ గడపకు వెలంపల్లి శ్రీనివాస్ అనే నినాదంతో ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా పాయకాపురంలోని వినాయకుడి ఆలయంలో పూజలు చేసిన తర్వాత కండ్రికలో శ్రీకనక దుర్గమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వెలంపల్లి 281వ సచివాలయం పరిధిలోని ప్రతీ గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తూ, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డివిజన్‌లోని ప్రతీ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు హారతులిచ్చి వెలంపల్లికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజలు ఆకర్షితులై ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీ వైపు ఉన్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు, సెంట్రల్ నియోజకవర్గం కార్పొరేటర్ల సమన్వయంతో పనిచేసి భారీ మెజార్టీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు సూచన మేరకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ఇద్దరం కలిసే పని చేస్తున్నామని తెలిపారు. టీడీపీ నేత బోండా ఉమా ఎన్నికలకు సిద్ధం కావాలని వెలంపల్లి సవాల్ విసిరారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అడ్డా అని, బోండా ఉమాకి, టీడీపీ రౌడీయిజానికి భయపడేదే లేదన్నారు. టీడీపీ సెంట్రల్ అభ్యర్థి ఎవరో తేల్చుకోవాలని సూచించారు. సెంట్రల్‌లో వైఎస్సార్ సీపీ గెలుపే తమ ఎజెండా అని వెలంపల్లి స్పష్టం చేశారు. కార్యక్రమంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మీ, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్ పి.గౌతంరెడ్డి, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ, కార్పొరేటర్లు బీ జానారెడ్డి, ఉమ్మడి రమాదేవి, బాలి గోవిందు, షహీనా సుల్తానా, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు

## ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి ఏఎంసీ కృషి

**అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):** ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి ఆజాద్ ముస్లిం కమిటీ(ఏఎంసీ) చేస్తున్న కృషి ఎనలేనిదని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకుడు బెజ్జం రవికుమార్ అన్నారు. సింగ్‌నగర్ భూదాల ఆదామ్ కల్యాణ మండపంలో ఆదివారం ఏఎంసీ ఆరవ వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు అండగా ఉంటూ ఏఎంసీ అనేక సేవా కార్యక్రమాలు చేస్తోందని పేర్కొన్నారు. ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా మాట్లాడుతూ నిరుపేద ముస్లిం ప్రజలను ఆదుకునేందుకు అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం పేద మహిళలు, వృద్ధులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బర్మా ఫణిబాబు, షేక్ అక్బర్, హఫీజ్, దేవిరెడ్డి రమేష్‌రెడ్డి, ఏఎంసీ నాయకులు షేక్ సాజిద్‌అలీ, బిల్డర్ నాగుల్‌మీరా, ఎండీ కాలేషా, సయ్యద్‌మౌలాలి, షేక్ ఇమ్రాన్, అబ్దుల్‌అజ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న రవికుమార్, నాగుల్‌మీరా, నాయకులు

## ఘనంగా ఉప్పులూరి భారతీమాత జయంతి

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, బాలా త్రిపురసుందరి ఉపాసకురాలు ఉప్పులూరి భారతీమాత జయంతి వేడుకలు ఆదివారం డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన సత్యనారాయణపురం మారుతి గ్యాస్ కంపెనీ ఆవరణంలో ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బీఎస్ఎన్ఎల్ విశ్రాంత డీఈ ఉప్పులూరి లక్ష్మీనారాయణ పాల్గొని భారతీమాత సేవలను కొనియాడారు. అనంతరం లక్ష్మీనారాయణ రచించిన మహాభారత యక్ష–ధర్మజ ప్రశ్నోత్తర పద్యశతకం పుస్తకాన్ని ఆవిష్కరించి భారతీమాతకి అంకితం ఇచ్చారు. తొలుత సీహెచ్ మారుతిప్రసన్న జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. కే రామ్మోహనరావు, నిట్ట సత్యనారాయణ, ట్రేడ్ యూనియన్ నేత టీవీ రమణమూర్తి, వేమూరి సంతోష్, డాక్టర్ బ్రహ్మదేశం సొసైటీ అధ్యక్షుడు వసంతకుమార్, గుర్రం ఏడుకొండలు, కొండాయగుంట రాము, వి.విశ్వేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



మహాభారత యక్ష–ధర్మజ ప్రశ్నోత్తర పద్యశతకం పుస్తకం ఆవిష్కరిస్తున్న దృశ్యం

## ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ ఆదిత్య చంద్రభట్ల



నిత్యావసర సరుకులు అందజేస్తున్న డాక్టర్ హరికుమార్

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవాలని ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఆదిత్య చంద్రభట్ల సూచించారు. స్థానిక దుర్గాపురంలో ఆదివారం వయోవృద్ధ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆరోగ్యంపై అవగాహన, ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యం వచ్చిన తర్వాత చికిత్స తీసుకునే కంటే ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా చూసుకోవడం మంచిదని అన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, సీజనల్ పండ్లు తీసుకోవాలని చెప్పారు. ఆయుర్వేద వైద్య నిపుణుడు డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్, హోమియో వైద్య నిపుణుడు డాక్టర్ కోనా వీరబ్రహ్మం మాట్లాడుతూ ఆయుర్వేదం, హోమియో చికిత్స ద్వారా అన్ని రకాల వ్యాధులను నయం చేయవచ్చని తెలిపారు. ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం సుమారు 400 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు.

**నిత్యావసర సరుకులు పంపిణీ..**

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన వయోవృద్ధులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్ మాట్లాడుతూ ట్రస్టీలు, దాతల సహకారంతో వయోవృద్ధులకు ప్రతి నెలా నిత్యావసర సరుకులు అందజేస్తున్నామని తెలిపారు. వయోవృద్ధులకు అవసరమైన సేవలు అందించడానికి ట్రస్ట్ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ట్రస్టీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### భార్యపై దాడి చేసిన భర్త

**పాయకాపురం(విజయవాడరూరల్):** భార్యపై రుబ్బురాయితో దాడి చేసి గాయపర్చిన భర్తపై నున్న పోలీసు స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు, పాయకాపురం రాజీవ్‌నగర్‌కు చెందిన శివకుమార్‌కి ప్రకాశం జిల్లాకు చెందిన శివపార్వతితో 17 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. ఆటోడ్రైవరుగా పని చేస్తున్న శివకుమార్ భార్యను తరుచుగా అనుమానిస్తూ, శారీరకంగా మానసికంగా బాధపెడుతుంటాడు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి భార్యతో గొడవపడి రుబ్బురాయితో తలపై దాడి చేయగా ఆమెకు గాయాలు అయినవి. దీంతో ఆమె తండ్రి నిమ్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### హనుమత్ దీక్షాపీఠంలో ప్రత్యేక పూజలు

**చిట్టినగర్(విజయవాడపశ్చిమ):** అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని పాలప్రాజెక్టు సమీపంలోని హనుమత్ దీక్షా పీఠంలో ఆదివారం నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం ఆలయంలో వీరాంజనేయ స్వామి వారికి పంచామృత అభిషేకాలు, తమలపాకులతో అర్చన నిర్వహించారు.

## అక్కినేని నటన భావినటులకు ఆదర్శం



అక్కినేని సినీ గీతాలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

**విజయవాడ కల్చరల్:** సినీ నటుడు నాగేశ్వరరావు నటనను భావినటులు ఆదర్శంగా తీసుకోవాలని న్యాయవాది చీదెళ్ళ నాగేశ్వరరావు అన్నారు. అక్కినేని నాగేశ్వరరావు ఫౌండేషన్ ఆఫ్ ఇండియా, తెలుగు కళావాహిని, శ్రీకళాభారతి, జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదిక మీద ఆదివారం అక్కినేని శత జయంతి సభ, సినీ సంగీత విభావరి, వివిధ రంగాలకు చెందిన కళాకారులకు ఆత్మీయ సత్కారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్కినేని నటించిన చిత్రాలు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నట్లు తెలిపారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ కృష్ణాజిల్లా కళల కేంద్రమని అన్నారు. గాయనీ గాయకులు అక్కినేని నటించిన చిత్రగీతాలను ఆలపించారు. అనంతరం గాయనీ గాయకులను ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు గోళ్ళ నారాయణరావు, శింగంశెట్టి చంద్రశేఖర్, జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్ తదితరులు అక్కినేని సినీ జీవిత విశేషాలను వివరించారు.

## విద్యార్థులకు ఉపకారవేతనాల పంపిణీ

**లబ్బీపేట(విజయవాడతూర్పు):** పేద విద్యార్థులకు సాయం చేసేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని మాజీ మేయర్ జంధ్యాల శంకర్ పిలుపునిచ్చారు. బృందావన కాలనీలోని ఏ కన్వెన్షన్ సెంటర్ వద్ద కస్తూరి పూర్ణచంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థినీ విద్యార్థులకు ఆదివారం ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జంధ్యాల శంకర్ చేతుల మీదగా విద్యార్థులకు ఉపకార వేతనాలు, స్కూల్ యూనిఫామ్, షూస్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కస్తూరి పూర్ణచంద్ర ఫౌండేషన్ 2012 సంవత్సరం నుంచి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం కస్తూరి పూర్ణచంద్ర ఫౌండేషన్ ఫౌండర్ ట్రస్టీ వల్లూరు అశోక్ బాబు మాట్లాడుతూ పకీర్‌గూడెంలో ఇటీవల మృతి చెందిన నిరుపేద కుటుంబాలకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందించామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు నూతన వస్త్రాలు అందజేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు వల్లూరు రవీంద్రనాథ్, చిలకపాటి ఉషారాణి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు అయోధ్య రామయ్య విజయోత్సవ సభ



సభలో మాట్లాడుతున్న రమాసత్యనారాయణ, వేదిక మీద విజయలక్ష్మి తదితరులు

**విజయవాడ కల్చరల్:** కౌతాపూర్ణానందం వేదిక మీద సోమవారం జరగనున్న అయోధ్య రామయ్య విజయోత్సవ సభలో ప్రజలు భాగస్వాములు కావాలని శాతవాహన కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమాసత్యనారాయణ అన్నారు. అభినేత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో హనుమంతరాయ గ్రంథాలయంలో లూయిస్ బ్రెయిలీ జయంతి, రామమందిర ప్రారంభ అభినందన సభను ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రామనామ జపంతో సర్వ పాపాలు హరిస్తాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. త్రినేత్ర దివ్యాంగ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు కామినేని ఉమాశంకర్ మాట్లాడుతూ దివ్యాంగులకు సమాజంలో ఉన్నత స్థానం కల్పించాల్సిన అవసముందని పేర్కొన్నారు. మహానటి సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ త్రినేత్ర సంక్షేమ సంఘం నిర్వాహకులు దివ్యాంగుల కోసం సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. దివ్యాంగ గాయనీ గాయకులు శ్రీరాముని గీతాలతో పాటు క్లాసికల్ గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో సీనియర్ పోలీస్ అధికారి దేవిడ్‌రాజు, గాయకుడు దండు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## రామభక్తిని చాటిన సంకీర్తన



రామనామ సంకీర్తన గానం చేస్తున్న ఎన్‌సీ లక్ష్మి బృందం

**విజయవాడ కల్చరల్:** అయోధ్యలో రామమందిరం నిర్మాణం సందర్భంగా లబ్బీపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, సామగాన లహరి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అయోధ్య రామ సంకీర్తనం రామభక్తిని, సంప్రదాయ సంగీత వైభవాన్ని చాటుతున్నాయి. రెండో రోజు ఆదివారం కార్యక్రమంలో ఎన్‌సీ లక్ష్మి బృందం గాత్ర కచేరీతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. పదకవితా పితామహుడు అన్నమయ్య, భక్తాగ్రేస్వరుడు రామదాసు, రామభక్తి సామ్రాజాన్ని చాటిన త్యాగరాజ స్వామి రచించిన కీర్తనలను గానం చేశారు. తుషార పూర్ణవల్లి బృందం, శృతి లయ నివాస్ బృందం సంప్రదాయ కీర్తనలను ఆలపించారు. సంగీత విదుషీమణులు విష్ణుభొట్ల సరస్వతి, విష్ణుభొట్ల కృష్ణవేణి సంప్రదాయ కీర్తనలను ఆలపించారు. కార్యక్రమాలను మల్లాది రాంప్రసాద్, మల్లాది శ్రీరాం నిర్వహించారు. విద్వాంసులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.